
# ప్రేమిస్తున్నాను నిన్నే!

## గోవిందరాజు సీతాదేవి



అపరాజిత కాలేజీ నుంచి ఇంటికి వచ్చేసరికి టైము ఆరుగంటలు దాటింది. ప్రహారీ గేటు తీసుకుని లోపలకి వస్తూ వరండా అంతా కలయజూసింది. తండ్రి చెప్పులు లేవు. అంటే కాఫీపొడి షాపు నుంచి ఇంకా రాలేదన్నమాట.

నీరసంగా చెప్పులు వదలి తన గదిలోకి వెళ్లింది. చీరా, జాకెట్టూ, టవలూ తీసుకుని బాత్రూమ్‌లోకి వెడుతూ చూసింది. తల్లి మీనాక్షమ్మ తులసి కోట దగ్గర సంధ్యాదీపం వెలిగించి పూజ పూర్తి చేసుకుని కళ్లు మూసుకుని ఉంది.

అపరాజిత స్నానం పూర్తి చేసుకుని బాత్రూమ్‌లో నుంచి బయటకు వస్తున్నా, తల్లి ఇంకా అలాగే ఉండటం చూసి-"అమ్మా!" అంది.

మీనాక్షమ్మ పలకలేదు.

"అమ్మా!" దగ్గరగా వెళ్లి మరోమారు పిలిచింది.

మీనాక్షమ్మ ఉలిక్కిపడ్డట్లు అయి కళ్లు తెరిచి కూతుర్ని చూసింది-"వచ్చావమ్మా... స్నానం కూడా చేసేశావా? ఉండు కాఫీ తెస్తాను!" అంటూ వంట గదిలోకి నడుస్తున్న తల్లి కళ్లల్లో నీళ్లు చూసింది.

అపరాజిత హాలులోకి వచ్చి సోఫాలో కూర్చుంది. 'ఏమై ఉంటుందీ?' అని ఆలోచించసాగింది.

రంగారావుకి ముగ్గురూ అమ్మాయిలే. పెద్దమ్మాయి అపరాజిత. ఎం.ఎస్సీ. పాసై ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తోంది. రెండో అమ్మాయి ధరణి. బి.కామ్. మూడో సంవత్సరంలోకి వచ్చింది. ఇంక మూడో అమ్మాయి గిరిజ ఇంటర్ చదువుతోంది.

రంగారావుకి కాఫీ పొడి వ్యాపారం. బాగానే సంపాదించి ఓ ఇల్లు కట్టుకుని ముగ్గురమ్మాయిల పెళ్లిళ్లకీ, చదువులకీ కూడబెట్టి ఉంచాడు. రంగారావు భార్య మీనాక్షమ్మ ఉత్తమ ఇల్లాలు.

రంగారావు అపరాజితకి పాతికేళ్లు నిండుతున్నాయని పెళ్లికొడుకుల వేట ప్రారంభించాడు. ఈ విషయం అపరాజితకి తెలిసిపోయింది. అంతే, మెల్లగా తల్లితో చెప్పింది "అమ్మా! నేనిప్పుడే పెళ్లి చేసుకోను. నాన్నగారికి చెప్పు!" అని.

మీనాక్షమ్మ ఈ వార్త భర్త చెవిన వేసింది.

"ఎందుకు పెళ్లిచేసుకోనన్నావ్?" రంగారావు కోపంతో మండిపడ్డాడు.

"నా ఫ్రెండ్ శ్రీధర్. అతను ఇంజనీరు. అమెరికాలో ఉద్యోగం వచ్చింది. వెళ్లాడు. ఒకటి రెండేళ్లలో వస్తాడు. నన్ను పెళ్లి చేసుకుని అక్కడికి తీసుకువెళ్తానన్నాడు" అపరాజిత భయంభయంగా చెప్పింది.

"అలాగా! ఇంజనీరు అల్లుడుగా వస్తే మాకూ సంతోషమేగా అమ్మా! ఇంతకీ అతని తల్లీ తండ్రీ, కులం, గోత్రం?" అంటూ వివరాలు అడిగాడు రంగారావు.

"అతని కులం ఏమిటో అతనికే తెలియదు. అనాథశరణాలయంలో పెరిగాడు. వాళ్లే అతనికి చదువు చెప్పించారు."

"చాలు చాలు! ఇంక నోరు మూసుకో! కులం, గోత్రం లేని అనాథని పెళ్లాడదామనే?" తండ్రి బిగ్గరగా అరిచినట్లే అన్నాడు.

మీనాక్షమ్మకి కాళ్లు వణకసాగాయి.

ధరణీ, గిరిజా తలుపు చాటున నిలబడి భయంభయంగా చూడసాగారు.

ఆ ఇంట్లో తండ్రి మాటకి తిరుగులేదు. తన మాట సాగినంతవరకూ ఆయన చాలా శాంతంగా ఉంటాడు. ఎవరు ఎదురుమాట్లాడినా ఆయన భరించలేడు!

"నువ్వు బికారి వెధవని పెళ్లి చేసుకుంటే నీ చెల్లెళ్లకి పెళ్లిళ్లు అవుతాయా?"

"అలా అయితే వాళ్లిద్దరికీ ముందు పెళ్లి చేసేయండి! ఎన్నాళ్లయినా నేను ఆగుతాను!" దృఢస్వరంతో అంది అపరాజిత.

"అంటే... నువ్వా బికారి వెధవనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నావా?"

"అవును. నా నిర్ణయం మారదు! నాకోసం పెళ్లికొడుకులను వెతకద్దు!"

"ఒసేయ్... అది అలా వాగుతుంటే గడ్డి పెట్టకుండా అలా చూస్తూ ఊరుకుంటావేమే మొద్దూ!?" అంటూ ఆగ్రహంతో భార్య మీదకి వెళ్లబోయాడు.

"నాన్నా!" అపరాజిత అడ్డుపడింది.

రంగారావు కోపం తారస్థాయికి వెళ్లింది-"నీ తల్లిని చావబాదితే నీకు బుద్ధివస్తుందే! నీకసలు పన్నెండేళ్లప్పుడే ఏ వెధవకో ఇచ్చి పెళ్లి చేసి నా గుండెలమీద కుంపటిని దించుకుంటే ఇవాళ నాకీ క్షోభ ఉండేదికాదే! నిన్నూ... నిన్నూ...!" అంటూ కూతురి మీద చెయ్యి ఎత్తిన భర్తకి అడ్డం వెళ్లింది మీనాక్షమ్మ.

అంతే! తన కోపాన్ని భార్యమీద చూపించి విసురుగా బయటకు వెళ్లిపోయాడు రంగారావు.

అపరాజిత అవమానభారంతో ముడుచుకుపోయింది. "నేనింక ఈ ఇంట్లో చస్తే ఉండను!" అని బట్టలు సర్దేసుకుంటున్న కూతుర్ని బతిమాలీ బామాలీ శాంతింపచేసింది మీనాక్షమ్మ.

చెల్లెళ్లు కూడా అక్క చేతులు పట్టుకుని ఏడవసాగారు. వాళ్లని చూసి తన మనసు మార్చుకుంది అపరాజిత.

రంగారావు పెద్ద కూతురితో మాట్లాడటం మానేశాడు.

అపరాజితకి యూనివర్సిటీ చదువు చెప్పించినందుకే తన మాట వినలేదని డిగ్రీలు కాకుండానే ధరణికీ, గిరిజకీ పెళ్లిళ్లు చేసేశాడు.

***


అప్పటివరకూ అక్క మీదున్న సానుభూతి కోపంగా మారిపోయింది ధరణికీ, గిరిజకీ. తండ్రి మాటకి ఏదురాడలేక పెళ్లిళ్లు చేసుకున్నా, దానికి కారణం అపరాజిత అని లోలోపల ద్వేషం పెంచుకోసాగారు. ధరణీ, గిరిజా భర్తలతో పండగలకీ, పబ్బాలకీ పుట్టింటికి వస్తూ పోతూంటారు.

రెండేళ్లు గడిచినా తిరిగి ఇండియా రాని శ్రీధర్‌ని నమ్ముకున్న అక్కనీ, ఆమె ప్రేమనీ మాటల్లో పెట్టి పరిహసిస్తూ వాళ్ల మనసులోని కోపాన్ని తీర్చుకుని సంతోషపడుతూంటారు.

ఇలాంటప్పుడు అపరాజిత మనసు గిజగిజలాడిపోతుంది. శ్రీధర్‌మీదా, అతని ప్రేమమీదా అచంచలమైన విశ్వాసం ఉంది. అతను అమెరికా వెళ్లిన కొత్తలో అంటే దాదాపు ఆరునెలలు ఉత్తరాలు రాశాడు. కానీ తర్వాత ఏమైందో ఒక్క ఉత్తరం కానీ, ఫోను కానీ రాలేదు. అయినా అపరాజిత భయపడలేదు, బాధపడలేదు. శ్రీధర్ ఉత్తరాలు ఎందుకు రాయటం లేదో ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు. ఏదో బలవత్తరమైన కారణం ఉండి ఉంటుంది. అదేమిటో తెలియటంలేదు. ఎప్పుడో ఒకరోజు హఠాత్తుగా వచ్చేసి, "అప్పూ!" అంటూ రెండు చేతులూ చాస్తాడు. అవును, అలా జరిగి తీరుతుంది. అయితే అది ఎప్పుడు జరుగుతుందో ఆ దేవుడికే తెలియాలి.

లోలోపల గంపెడంత ఆశతో శ్రీధర్ కోసం ఎదురుచూస్తూనే ఉంది అపరాజిత.

రోజులూ, నెలలూ దొర్లిపోతూ మరో రెండు సంవత్సరాలు కాలగర్భంలో కలసిపోయాయి.




అయినా అపరాజిత విశ్వాసం, నమ్మకం చెక్కుచెదరలేదు.

***

అపరాజిత సోఫాలో కూర్చుని తన గతాన్ని గుర్తు చేసుకుంటూ అలా ఉండిపోయింది.

"అప్పూ! అప్పూ!" మీనాక్షమ్మ ప్రేమగా పిలిచిన పిలుపుకి ఉలిక్కిపడి ప్రస్తుతానికి వచ్చింది.

"ఇదిగోనమ్మా, కాఫీ!" కాఫీ కప్పు అందించింది.


తల్లి చేతిలోని కప్పు అందుకుని కాఫీ తాగేసి కప్పు కిందపెట్టేసింది.

మీనాక్షమ్మ కూతురి దగ్గరగా కూర్చుని ఏదో చెప్పాలని చెప్పలేక సతమతమవటం గ్రహించి, "ఏమిటమ్మా?" అంది తల్లి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"శ్రీధర్ కోసం ఎదురు చూడటం ఇంకా ఎన్నాళ్లు?"

మూడు సంవత్సరాలుగా తను నిరీక్షిస్తున్నా తల్లి ఇలా ఈ విషయం ప్రశ్నించటం ఇదే ప్రథమం.

అపరాజిత ఆశ్చర్యపోతూ, "ఏమ్మా, ఎందుకలా



అడుగుతున్నావు?" అంది.

"నాకు జవాబు చెప్పు!" తల్లి మెల్లగా అంది.

"ఎన్నాళ్లయినా ఎన్నేళ్లయినా సరే, నేను నిరీక్షిస్తూనే ఉంటానమ్మా!"

మీనాక్షమ్మ కూతురి కళ్లల్లోకి క్షణం పరీక్షగా చూసింది. ప్రేమగా దగ్గరగా లాక్కుంది. ఆ తర్వాత "ఇదిగో, శ్రీధర్ దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం!"

"ఆఁ! శ్రీధర్ దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందా? నిజంగానా! ఏదీ?"

మీనాక్షమ్మ జాకెట్టులోనుంచి ఓ పొట్లంలాంటిది తీసి కూతురి చేతిలో పెడుతూ, "అప్పూ! శ్రీధర్ నీకు నెలకో ఉత్తరం రాస్తూనే ఉన్నాడమ్మా. కానీ మీ నాన్న ఆ ఉత్తరాలు నీకు అందనీయకుండా నన్ను కట్టడిచేసి వాటిని తను తీసుకుని కాల్చిపారేసేవారమ్మా! ఈసారి ఉత్తరం చించి ముక్కలు చేసి విసిరిపారేసి బయటకు వెళ్లిపోయారమ్మా! నేనా ముక్కలన్నింటినీ ఏరి నీ కోసం దాచానమ్మా!" అంటూ తల్లి జాకెట్టు లోపల భద్రంగా దాచి ఉంచిన కాగితం పొట్లం కూతురి చేతిలో పెట్టింది.

"ఏమిటీ... శ్రీధర్ ఉత్తరం రాశాడా? నాకు ఉత్తరం రాశాడా...?" పొట్లం అందుకుని చప్పున గుండెలకి హత్తుకుని తన గదిలోకి పరుగుతీసి తలుపు ధామ్మని మూసేసుకుంది. అదిరే గుండెతో ఆ ముక్కలను వరుసగా పేర్చింది. విషయం తెలుసుకోవాలని విశ్వప్రయత్నం చేసింది. ఎంత కష్టపడినా విషయం పూర్తిగా అర్థం కాలేదు గానీ, శ్రీధర్ వస్తున్నట్లుగా అర్థమైంది. కానీ ఏరోజు ఎలా వస్తున్నాడో మాత్రం అర్థం కావటంలేదు. అప్పుడే టైము ఏడు గంటలు దాటింది. పిచ్చి ఆవేశంతో లేచింది. హేండ్‌బాగ్ తీసుకుంది. "అమ్మా! నేను శ్రీధర్‌కోసం వెడుతున్నాను!" అంటూ రివ్వున వెళ్లిపోయింది.

విమానాశ్రయానికి వెళ్లింది. అప్పుడు వచ్చే ప్లేన్స్ ఏవీ లేవని తెలుసుకుని రైల్వే స్టేషన్‌కి వెళ్లింది. బస్ స్టాండ్‌కి వెళ్లింది. పిచ్చి పట్టినట్లుగా తిరిగితిరిగి రాత్రి పన్నెండింటికి ఇల్లు చేరింది.

తండ్రి ఆవేశంతో ఊగిపోతూ ప్రశ్నించాడు -"ఇప్పటి వరకూ ఎక్కడ తిరిగివచ్చావ్?" అని.

అపరాజిత మొట్టమొదటిసారి తండ్రి ఎదురుగా నిలుచున్నది. ధైర్యంగా "నాకొచ్చిన ఉత్తరాలు నువ్వు ఎందుకు చించిపారేశావ్?"

రంగారావుకి అర్థమైపోయింది. భార్య తన మాట లక్ష్యం చేయకుండా కూతురికి చెప్పేసిందని. ఎప్పటిలా ఆమెమీదకు ఉరకబోయాడు.

"నాన్నా!" అపరాజిత తండ్రి చెయ్యి గట్టిగా పట్టుకుంది.

"జాగ్రత్త! ఇంకొక్క అడుగు వేశావో... మర్యాద దక్కదు!"

రంగారావు నిర్ఘాంతపోయాడు. క్షణం కళ్లప్పగించి చూశాడు. ఆదిశక్తిలా నిలబడిన కూతురివైపు. అంతలోనే ఆయనకి అవమానంగా అనిపించి "ఛీ! ఛీ! నా కూతురు నన్ను ఎదిరించటమా?" అంటూ జుట్టు పీక్కుంటూ తలుపు తెరుచుకుని బయటకు వెళ్లిపోయాడు.

అపరాజిత అలసిపోయినదానిలా కూలబడిపోయింది.

"అప్పూ! అప్పూ! నీ కోసం శ్రీధర్ వచ్చాడమ్మా!" నీరసంగా అంది మీనాక్షమ్మ.

"ఆఁ... శ్రీధర్ నా కోసం మనింటికి వచ్చాడా? ఏడీ, ఎక్కడా?!"

"శ్రీధర్ వచ్చేసరికి మీ నాన్న ఉన్నారు. అతను చెప్పేది వినిపించుకోకుండా పిచ్చిగా ప్రవర్తించారు. అవమానపరిచారు. అయినా అతను అదంతా భరించాడు. 'అప్పూ! నేను వచ్చేశాను, నా దగ్గరకి వచ్చేసెయ్!' అని అరిచాడు. నాన్న అది విని వీధి తలుపు ధామ్మని మూసేశారు. అప్పుడు కూడా నేనేం చేయలేకపోయానమ్మా! అతను చాలాసేపు నిలబడి తర్వాత వెళ్లిపోయాడమ్మా!" తల్లి బాధగా చెప్పసాగింది.

"అమ్మా! నేను తనకోసమే వెళ్లానన్న ఒక్క మాట చెప్పలేకపోయావా అమ్మా!" అపరాజిత తల్లి శరీరం మీద గయాలని బాధగా చూస్తూ అంది.

"చెప్పాలని ప్రయత్నించాను. కాదు... చెప్పాను. అందుకే... అందుకే నాకీ శిక్ష! ఇన్నాళ్లుగా నేను భరించే ఈ బాధను ఇంక ఒక్క క్షణం కూడా భరించలేనమ్మా! నాకింక శక్తి లేదు!" ఆవిడ రోదించసాగింది.

"అమ్మా! పద, మనం ఈ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోదాం!"

"వెడదాం. కానీ ఒక్క రోజంటే ఒక్క రోజు ఆగు... శ్రీధర్ మళ్లీ నీ కోసం వస్తాడన్న ఆశ నాకుంది!"

"అమ్మా!" అపరాజిత తల్లిని గుండె దగ్గరగా పొదువుకుంది ఒక్క క్షణం. "ఉండు, గాయాలకి కాస్త మందు రాస్తాను!"

## నూతనయుగసూర్యుడు

నీవు నమ్ముతావా...
కాలచక్రం తిరిగి తిరిగి
జీవితాన్ని క్రాసుగా మనిషిని క్రైస్తుగా
మలిచిన ఈ రోజు
ఒక నూతన యుగసూర్యుడు ఉదయిస్తున్నాడు
మనకు కానుక తెస్తున్నాడు ఒక నూతనగీతను
విప్లవాన్నీ వీరమరణాన్నీ ఉద్ఘోషించే
ఉచ్చైస్వరగీతను
ఇవాళ ఈ సాహసోపేతనూతనయుగం
సంకెళ్లు ఛేదించి మహాశక్తిగా మార్చిన
మనిషి
అవని మీద పెట్టిన అడుగులు చాలక
అనంతాన్ని ఆక్రమిస్తున్నాడు-
ఇనపరంగు ప్రత్యూషాలు తుపాకి మందుగంధాలు
కండల్లో నిదురించే రణకండూతిని
మేల్కొలుపుతున్నాయి
ఒక యుగపు నినాదాలూ సిద్ధాంతాలూ-
ఆ యుగపు చెత్త అంతా-
చరిత్రతో కలిసి వెళ్లిపోయాయి-
ఉద్రేకభావలావాల్లో పడి మానవుడు
నూతనతీరాలకు కొట్టుకుపోతున్నాడు
ప్రాక్పశ్చిమాల మధ్య వెలుగుచీకట్ల తీరాల మధ్య
ఇటూ అటూ కొట్టుకుపోతున్న
మండే సూర్యమండలంలా మానవుడు
తీరాన్నించి తీరానికి కొట్టుకుపోతున్నాడు
ఆ మనిషే ఈ నాడు చరిత్ర పురాతనగుహల్లోంచి
ప్రతిధ్వనించే పాలికేకలా ఆకాశం మీదికి
విరుచుకుపడుతున్నాడు
అసత్యాన్ని శిలువకు పంపుతున్నాడు!!

గుంటూరు శేషేంద్రశర్మ

"వద్దు, వద్దమ్మా అప్పూ! నీ ఒడిలోనే నాకు హాయిగా ఉంది. నన్నిలాగే కాసేపు ఉండనీ!"

అపరాజిత తల్లిని ఇంకా దగ్గరగా తీసుకుంది తన మనసులో రేగుతున్న హాలాహలాన్ని అదిమిపెట్టుకుంటూ.

***

అపరాజిత ఫ్రెండ్ నీరజ తెల్లవారేసరికి వచ్చింది.

"అపరాజితా! శ్రీధర్ నిన్న వచ్చాడుట. కానీ అతని వెంట ఓ నీగ్రో అమ్మాయి కూడా ఉందట!"

అపరాజిత గుండె గుభేల్మంది ఈ మాటకి.

"నిజమా?"

"నిజం! ఆ అమ్మాయి శ్రీధర్ చెయ్యి పట్టుకుని ప్లేన్ దిగుతుండగా మా అన్నయ్య చూశాడట. 'శ్రీ...శ్రీ...' అంటూ శ్రీధర్ని వదలటం లేదట!"

అపరాజిత మనసులో సప్తసముద్రాలు పొంగుతున్నంత ఘోష!

అపరాజిత కళ్లు మూసుకుని అలా కూర్చుండిపోయింది.

శ్రీధర్కోసం తన నిరీక్షణ, అతనంటే తనకున్న నమ్మకం, అతన్ని అర్థం చేసుకున్నానన్న విశ్వాసం... ఇవన్నీ అపోహలేనా? కాదు... కానేకాదు-అని మనసెంత చెప్తున్నా కళ్లల్లో నీరజ వర్ణించి చెప్పిన నీగ్రో అమ్మాయి రూపమే కదలసాగింది.

ఆ అమ్మాయి 'శ్రీ...శ్రీ' అంటూ చనువుగా ప్రవర్తిస్తోంది అంటే అర్థం?... మనసు భగ్గున మండుతోంది. అప్పుడప్పుడూ అందరూ తననీ, తన ప్రేమనీ హేళన చేస్తూ మాట్లాడిన మాటలు మనసులో ప్రతిధ్వనిస్తున్నాయి.

శ్రీధర్ గురించి అలా వాళ్లు అనుకుంటూంటే తను నవ్వుకునేది. కానీ ఇవాళ వాళ్ల మాటే నిజమైతే? అపరాజిత ఇంక ఆలోచించలేక తల గట్టిగా పట్టుకుని కూర్చుండిపోయింది.

వారం రోజులు గడిచిపోయాయి. అయినా శ్రీధర్ రాలేదు. అపరాజిత కాలేజీకి కూడా వెళ్లలేక ఇంట్లో ఉండలేక మానసికక్షోభని భరిస్తూ అలాగే ఉండిపోయింది.

***

వారం రోజుల తర్వాత రంగారావుగారి ఇంటి ముందు ఆటో వచ్చి ఆగింది. అందులోనుంచి శ్రీధర్తోపాటు ఓ నీగ్రో అమ్మాయి కూడా దిగింది. ఇద్దరూ లోపలకి అడుగుపెట్టబోతూండగా అపరాజిత చూసింది. అలాగే నిలబడిపోయింది.

"అప్పూ!" అంటూ నీగ్రో అమ్మాయి పరుగున వచ్చింది-అపరాజిత చెయ్యి పట్టుకుని షేక్హేండ్ ఇస్తూ.

"అప్పూ! నువ్వు చాలా అందంగా ఉన్నావు!" అంది ఇంగ్లీషులో.

"నిన్ను శ్రీ అప్పూ అని పిలుస్తానని చెప్పాడు. అందుకే నేనూ అప్పూ అని పిలుస్తున్నాను. కోపగించుకోకు!" నీగ్రో అమ్మాయి గలగలా మాట్లాడేస్తోంది.

మీనాక్షమ్మా, అపరాజితా స్థాణువుల్లా నిలబడిపోయారు.

"నా పేరు గౌరి. ఈ తెలుగుపేరు శ్రీధర్ పెట్టాడు. ఈ పేరంటే నాకూ చాలా ఇష్టం. ఎందుకో తెలుసా... శ్రీధర్ అంటే నాకిష్టం! కాదు, అతన్ని ప్రేమిస్తున్నాను!" క్షణం ఆగింది గౌరి.

అపరాజిత ముఖం ఎర్రగా కందినట్లుగా అయింది. కళ్లు ఎర్రబడ్డాయి.

ఇదేం పట్టించుకోని గౌరి మళ్లీ చెప్పటం ప్రారంభించింది. "చూడు, అప్పూ! ఇండియా అంటే నాకెంతో ఇష్టం. ఈ ఇష్టం ఎలా ఏర్పడిందంటే శ్రీధర్తో పరిచయం అయిన తర్వాతే. అమెరికాలో ఉన్న ఎందరో అందమైన డబ్బున్న అమ్మాయిలు శ్రీధర్ అందాన్ని, తెలివినీ, వ్యక్తిత్వాన్నీ ఇష్టపడి దగ్గరవ్వాలని ఎంత ప్రయత్నించినా ఇతను వాళ్లని అతి నిర్దయగా, దూరంగా ఉంచేవాడు. ఎందుకంటే అతని గుండెలో నీవే నిండిఉన్నావు కనుక. నాలుగు సంవత్సరాలుగా దూరంగా ఉన్నా, అతని మనసు నీ దగ్గరే ఉంది. 'ప్రేమకి ఇంత శక్తి ఉందా?' అని ఆశ్చర్యపోయాను. అందుకే ప్రేమించాను శ్రీని. ప్రేమించాను నీ తల్లిని, నీ దేశాన్ని. ప్రేమించాను నీ ప్రేయసిని... ప్రేమించాను నీవు నడిచిన ఈ భూమాతని! ప్రేమించాను ఈ గాలినీ, ప్రకృతినీ... ఒకటేమిటి ఈ దేశంలోని నదీనదాలనీ, గుళ్లూ-గోపురాలనీ... ప్రేమకి నిర్వచనం నీ నుంచి నేర్చుకున్నాను. ప్రేమంటే శారీరకసుఖం కాదనీ, అంతకు మించినది చాలా ఉందనీ నాకు అర్థం చెప్పిన శ్రీ. నేను నా దేశానికి వెళ్లిపోతున్నాను, అక్కడ నా జన్మభూమిని ప్రేమిస్తాను, నా దేశప్రజలను ప్రేమిస్తాను. ఇంకా ఇంకా చాలా చెప్పాలని ఉన్నా, ఆ భావాలను బయటకు చెప్పగలిగే భాష నా దగ్గర లేనందున విచారపడుతూ వీడ్కోలు తీసుకుంటున్నాను. అప్పూ! అప్పూ మదర్... ఫాదర్... బై...! అప్పూ! నే నీ దేశాన్ని కొంత చూశాను. కాదు, నీ శ్రీధర్ చూపించాడు. మాతృదేశాన్ని కూడా ఎంతగా ప్రేమించాలో శ్రీధర్ నేర్చుకుని నా దేశప్రజలకి భారతదేశంలోని ప్రేమని మూటకట్టుకుని వెళ్లిపోతున్న నన్ను, విమానం ఎక్కించటానికి రావూ, అప్పూ?"

గౌరి గలగలా సగం ఇంగ్లీషూ, సగం తెలుగూ కలగలిపి చెప్పేసి అపరాజిత చెయ్యి పట్టుకుని లాక్కుపోసాగింది.

రంగారావు నోరు తెరిచి చూడసాగాడు.

మీనాక్షమ్మ కళ్లల్లో సంతోషం, దుఃఖం కలగాపులగంగా కనిపించసాగాయి.

అపరాజిత పరుగున వెళ్లి శ్రీధర్ చెయ్యి గట్టిగా పట్టుకుంది.

శ్రీధర్ గౌరినీ, అపరాజితనీ తీసుకుని ఆటోలో వెళ్లిపోయాడు. ■

## కాలమా! ఆగు

సాగుచున్నది, కాలచక్రనేమి
సరభసమ్ముగ సుంత విశ్రాంతి లేక
గతుల వలయాన వేరొక గతిని గనక
అరుణుడంతటివాడు మిట్టాడుచుండె.
నీటిమయమై ఉన్న ఆనాటి జగతి
కోటికోట్ల కంప్యూటర్ల నేటి జగతి
చూడ నీ రెండు నొకవాడు జాడనుండు
అర్థి కుర్చీల కొరకు కొట్లాట యగుట.
నలువ ఆనాడు కమలాన కొలువుదీర
'కాతరోసి, త్యజాశు వై గచ్ఛ గచ్ఛ'
అనరె మధుకైటభాసురు లాగ్రహాన
ముసిరె ఆనాడ కుర్చీ వ్యామోహమకట!
ఎవ్వడేని వాంఛించెనా ఇంద్రపదవి
తపము జేసెనా, తానర్హతలను బొంద
'మోనికొను పంపు తా మోసగించు
ఇంద్రుడక్కట ధర్మమొక్కింత లేక.
నాటి సంప్రదాయమ్మె ఈ నాడుగూడ
ప్రబలియున్నది నేటి ప్రపంచమందు
కుర్చీకై పోరు శాంతిని కూలద్రోసె
మానవీయత కోల్పడి మాయమయ్యె.
కాలమా! ఆగు! భూమి నక్షత్ర సూర్య
గణములార! ఆపండి మీ గతుల మీరు
క్రొత్త సంప్రదాయము మొలకెత్తనిండు!
ఉర్వి కుర్చీకై పోరు లేకుండు గాత!

కనమలూరు వెంకటశివయ్య